# సంసారగోష్టి

శ్రీమతి తాయి జయలక్ష్మీగారు

'ఇదుగో తలుపు.'

'............'

'నిన్నే తలుపు.'

'............'

'ఏం-నిన్నే-ఏం జేస్తున్నావు. తలుపు తీయి' అన్నాడు బిగ్గరగా సూర్యనారాయణమూర్తి.

'ఆఁ—వస్తున్నా.'

'ఎంతసేపు? కాళ్లు గాలుతున్నాయి.'

'అందుకనే వస్తున్నా' అని తలుపు దెరచింది అనసూయ.

'పిలవంగానే తీయలేవు తలుపు. కాళ్లు నెత్తి మాడుతుంటే.'

'...............'

'సమాధానం జెప్పవేం. అల్లా చూస్తావు.'

'...............'

'చెవుడొచ్చిందా యేం' అని దగ్గరకుబోయాడు కళ్లెరుపు జేసుకొని.

'ఏం జేయమంటారు మరి మడిగట్టుకుంటే.'

'తలుపు తీయటానికేం.'

'తిరగమోత వేస్తున్నా-మాడిపోతే ఓ చిన్న యుద్ధం అవుతుందిగా మనింట్లో.'

'అదిమాడితే నీ వీపూ మాడుతుంది' అన్నాడు నవ్వుతూ.

'మనకున్న ప్రయోజకత్వం అదేగా.'

'నోరు మూయి.......'

'మడి గట్టుకున్నాగా.'

'నాస్సెన్సు. నీకుగాదూ చెప్పటం.'

'అబ్బో, ఫస్టు ఫారానికే యింత యింగ్లీషు' అంటూ చక్కాబోయింది వంటయింట్లోకి.'

సూర్యనారాయణమూర్తి చొక్కా విప్పేసి ఆలోచిస్తున్నాడు కుర్చీలో కూర్చొని. నాలుగు తెలుగు ముక్కలు చదువుకుందో లేదో దీనికి పెద్ద గర్వం చదువుకున్నదాననని. నేను పట్టి మూర్ఖుణ్ణి అనే యిది అనుకోవటం. చదువుకున్న పెళ్లాం గావాలి అంటారు కొందరు. ఉంటే యిల్లాగే వుంటుంది గాబోలు. ఛీ! పిచ్చి! నా ప్రథమభార్య చదువుకున్నది గాదూ !!

కాస్త గృహలక్ష్మి, భారతి చదువుతున్నదో లేదో, నేను విద్వాంసురాలననే,.........ఉన్న వూరూ, కన్నతల్లి ఓ మోస్తరని చెప్పేవాళ్లు వెర్రి వాళ్లుగారు. స్వగ్రామాన్ని వదిలేశాను యిది వచ్చిం తరువాత. కాస్త దీనికి సందిచ్చేటప్పటికి నెత్తి కెక్కుతోంది. మూడోపెళ్లి గదా అని మూకీభావం వహిస్తున్నాను. నలుగురు తిడతారని.........

'వంట అయింది.'

'............'

'మిమ్మల్నే, వంట అయిందండీ.'

'ఏంజేశా వన్నంలోకి.'

'కాయ, కూర, పులుసు.'

'ఏం కాయలు. నీ తలకాయా.'

'కనుక్కున్నారే మీరు. నిజంగా మీతలకాయే.'

'గాడిదా! ఒళ్ళు పగులుతుంది.'

'ఎందుకంత కోపం మీకు. అనపకాయ తలకాయ తలకాయవైపు నాది అన్నారుగా మీరు నిన్న కోస్తూ.'

'..........'

'ఇంత మరుపు అయితే యెలాగండీ......సరే గాని మడిగట్టుకోండి త్వరగా.'

'పోవాలా యేమిటి వరలక్ష్మమ్మగారింటికి.'

'మేము చీట్లు ఆడుతు చుట్టలు తాగంగా.'

'పొడుం బీలుస్తారా మరి.'

'కాదు గంజాయి.......'

'నోరు మూయి' అంటూ చివాలునలేచి చెంప మీద గొట్టినాడు సూర్యనారాయణమూర్తి నెమ్మదిగా, అంటే తగిలీ తగలకుండా.

అనసూయ కళ్లనీరుగారుస్తూ గోడనానుకుని నిలబడ్డది. కుమిలిపోతోంది లోపల. అనేక ఆలోచనలు తట్టాయి మనస్సులో. భార్యలపై యింత అధికారముంది గాబోలు భర్తలకు అని అనుకుంది.

'పో. వడ్డించు త్వరగా.'

'..................'

'నిన్నే పోవే.'

అనసూయ మాటాడకుండా పోయింది వంట యింట్లోకి.

సూర్యనారాయణ సావిట్లో గోడనున్న పటాన్ని చూస్తున్నాడు. పాపం. యిది బతికివున్న రోజుల్లో ......అమాయకురాలు నా గొడవే బట్టేదిగాదు. దానికి ఎంతసేపూ తులసిపూజలు, దానధర్మాలు దప్ప........చచ్చిపోయినవాళ్లే మంచివాళ్లు యెపుడూ! అని అనుకుంటున్నాడు.

'వడ్డించాను. రావచ్చు.'

'................'

'ఇంకోతడవ జెపితే తంటా గాబోలు.'

సావిట్లోకి వచ్చి చూసింది ఆయనగారి స్థితి. పటాన్ని జూడడం, పెదవి విరుచుకోవడం......

'ఆవిడెను మాత్రం బ్రతకనిచ్చారు సరిగ్గా. చచ్చిపోయిం తర్వాత యేడిస్తే యేంలాభం. బతికివున్నప్పుడే మైపోయిందో యీ ప్రేమ.'

'ఇక చాలు. ఆపు నీ గ్రంథము. ప్రేమ అంటే యేమిటో తెలుసు నీకు.'

'ఎబ్బే నాకేం తెలుసు......కాళిదాసంత పండితులాయను మీరు.'

'ఆఁ అవును. ప్రేమగలవాఁడైతే పెళ్లాన్ని యెందుకు వదిలేస్తాడు.

'ఆలోచనలేకుండా చేయటానికి మనంత మూర్ఖుఁడు గాదు లెండి ఆయన.'

'సౌదామిని అంత పండితురాలవు గాదూ నీవు. మొదట కాళిదాసు మాత్రం మూర్ఖుఁడు గాదా మరి.'

'ఆ గొడవంతా యెందుకు లేండి మనకు...... చెప్పిందానిలో యిదన్నా కాస్త జ్ఞాపకంవుంది. పదార్థాలు చల్లారిపోతున్నాయి. 'చల్లారినయేని చవులుగవ్వ" అన్నాడు శ్రీనాథుఁడు కాశీఖండంలో, రాఁడి త్వరగా.'

సూర్యనారాయణమూర్తి వచ్చి కూర్చున్నాఁడు పీటమీద. తిఁటానికి ప్రారంభించాడు గబాగబా.

'కొంచెం నెమ్మదిగానే తిందురూ. లగ్నం మించిపోవటంలేదు.'

'...............'

'మీకే జెప్పేది.'

'పోయి. పెరుగుబొయ్యి.'

'అపుడేనా–? పెరుగులే దివ్వాళ.'

'ఎందుకనీ.'

'పనిజేసేది రాలేదు.'

'రాకపోతే.'

'తెప్పించలేదు.'

'పనిజేసేదాన్ని కోప్పడాలి మరి.'

'నేను కోప్పడలేను. మనం యిచ్చే రూపాయి డబ్బులకు అంత కోప్పడాలా యేమిటి......ముష్టి రూపాయి కూలి చేసుకుంటే సంపాదిస్తారు వాళ్లు. పరిజనులంను దయగావుండాలట.'

'సరే దయగావుంటే నెత్తికెక్కుతారు. చూడు మనింటిపక్కనున్న ఓర్సీలుగారి భార్య యెల్లా అధారిటీచేసి పని చేయించుకుంటుందో పనివాళ్ల చేత.'

'బాబో. ఆ పోలిక నా కక్కర్లేదు లెండి. పోసేదా మరి మజ్జిగ.'

వినుగుకుంటూ అన్నం తిన్నాడు. వాకిట్లోకి వచ్చి కూర్చున్నాఁడు కుర్చీలో. అతివేగంగా భోజనంజేసి అన్నీ సర్దుకొనివచ్చింది అనసూయ.

'మంచి తాంబూలములేని భోజనము' అన్నాడు.

'సంతతిలేని గృహమో' అన్నది.

'ఏదీ. అంతాపాడు—ఆపద్యం......సరేగాని యెల్లావస్తాయి యిలాంటి పద్యాలు నీకు.'

'చదువుకుంటే.'

'నేను చదువుకోలా మరి.'

'ఇప్పుడు చదువుకోండి చూద్దాం.'

'ఇంకా యిప్పుడేం వస్తుంది.........అయినా ఆడవాళ్లదగ్గర చదువుకోనా.'

'ఆఁ రాకేంజేస్తుంది? జగ్గకవి, మల్లినాథసూరి యెప్పుడు చదువుకున్నారు'

'పెళ్లాం కాపరానికి వచ్చింతర్వాత.'

'మరింకేం. యెలా తెలిశాయి మీ కివి.'

'ఓతడవ చెప్పావుగా నీవు.'

'ఆఁ మరచిపోయాను.'

'మరి మరుపు నీకా, నాకా?'

'సరే గానీండి. మీ డబ్బుకు తగిన చదువుంటే యెంతో బాగుండేది. బంగారానికి వాసనున్నట్లు... ......'

ఇంకేం, నీవు రామకునే నూనెలో వేయిబంగారం'......నాకు చదువులేకపోతే మరేం లోటు లేదు. చదువుకున్నప్పటినుంచీ అడ్డమైనవాళ్ల కాళ్లూ పట్టుకోటమేగా!......అదిగాకుండా ధనముంటే సర్వమూవున్నట్టే. ఐశ్వర్య బలముంటే అన్నీ సాధించవచ్చు. అందరూ భయపడతారు. * అందుకనేగా భీష్మాదులు, దుర్యోధనాదులు (ద్రౌపదిని మానభంగం జేస్తుంటే చూస్తూ వూరుకున్నారు. చదువుకున్నదానివిగా! ఆ శ్లోకాలు రావు నీకూ.'

'నేను సంస్కృత భారతం చదవలా.'

'మరి మూలం చదవందేనా భారతాన్ని గురించి చెప్పుతావు.'

'నే డీయన ప్రసంగంజూస్తే వింతగావుంది' అనుకుంది మనస్సులో.

'మూలాన్ని అనుసరించి వ్రాసిందేగా' అన్నది.

'అనువాదంలో భేదముంది.'

'ఎక్కడ?'

'చాలా చోట్ల.'

'ద్రౌపదీ వస్త్రాపహరణంలో వుందా.'

'పూర్తిగా ద్రౌపదీ వస్త్రాపహరణం జరగలేదని నీవు చదివే గృహలక్ష్మిలో వ్రాశారే! దాన్ని జరిపి అంటున్నావు గాబోలు.'

'అవును. మీరు చదివారా మూలం.'

'లేదు. మీబోటి విద్యావతులు చెప్పుకుంటుంటే విన్నా.'

'ఏమని?.'

'జరిగిందని.'

'చెప్పండి చూద్దాం.'

'ప్రొద్దుబోయింది. యింకోమారు చెపుతాను.'

'ఆంధ్రభారతం అన్నా చదివారా?!

'కొంచెంగా ఆదిపర్వం.'

'సప్తమాశ్వాసం చదివారూ?.'

'ఆఁ చూచాను. ఏం?'

'ఈ పద్యం జదివారూ.'

'చెప్పు చూద్దాం.'

చం|| 'నెఱిగురులుఁ బ్విలోలసిత నేత్రయుగంబును
నొప్పులొల్క వా.........
...లతాలలితాంగి......విలాససంపదన్.
ఆ. ౭-ప. 73.

'ఇదేమిటి నెఱికురులు అని వుండాలిసింది యిల్లా వుందేం. తప్పుగాదూ. లతా......ఏం చెప్పుతారూ. లతవలె......

'సరే......ఓహో. ఆ పండితుఁడు వ్రాసిన టీకచూచి అంటున్నావేం. అది తప్పు. యిల్లాగే వుండాలి......నెఱికురులు అంటే వక్రములైన వెంట్రుకలు.'

* "బలవాంశ్చ యథాధర్మం లోకేపశ్యతి పూరుషః ధర్మవేలాయాం భవత్యభిహతః పరః| నవివేక్తుం చతే ప్రశ్నమిమంశక్నోమి నిశ్చయాత్." (సంస్కృత భారతం—ఐశ్వర్యబలం)

'నెఱిగురులు - సాధువు. ఇది కర్మధారయసమాసంగాన 'క' 'గ' అయింది.

"సూ" పరుషావాస్యరూపేణ ప్రథమాంతో పరిస్థితాః। కాకా సంబోధనేచా పిహ్యవ్యయే కర్మధారయే। అచేతనార్థకేశబ్దే' అని శృంగారభూషణంలో వుంది .. తెలిసిందా. ఇక లతకు.....

లతా లలితాంగి - ప్రియంగువులె మనోహరమైన దేహం గలది.

'శ్యామాతు మహిళాహ్వయా। లతాగోవందనీ గున్ద్రాప్రియంగుః ఫలినీఫలీ' అని అమరం. అన్ని లతలలో ప్రియంగులత స్త్రీదేహమున కత్యంత సదృశం. మేఘసందేశంలో 'శ్యామాస్వంగం చకితహరిణీ ప్రేక్షణే దృష్టిపాతం' అనివుంది. 'కృత్వాశ్యామా విటపసదృశం స్రస్తముక్తం ద్వితీయం' అని మాళవికాగ్నిమిత్రం.

ఇంకా ప్రియంగువు గంధపొడికిని, కలపమునకు నుపయోగిస్తుంది. చూడు ఋతుసంహారంలో.

'ప్రియంగు కాళీయక కుంకుమాక్తం స్తనేషు గౌరేషు విలాసినీభిః। ఆలిప్యతే చందనమంగనాభి ర్మదాలసాభి ర్మృగనాభియుక్తం' అని కాళిదాసు ప్రాశాడు. దీనికిగల పరిమళమును నొక సాదృశ్య కారణము. ఇన్నివిధముల సద్విశల సంఘటిల్లుట బట్టియే దీనికి మహిళా నామంగలిగిందని నిఘంటువు లోని 'మహిళాహ్వయా' అను నామము చెప్పక చెప్పుతున్నది. కాబట్టి యిట్టిచోట్ల 'లతా' శబ్దానికి సాధారణలత యనిగాక 'ప్రియంగువు' అని అర్థము చెప్పాలి. అది మహాకవి హృదయానుగుణము...... ఏం అంతేనా! తప్పు జెప్పానా!! తప్పు అయితే మీ పండితులను అడుగు. ఏం చెప్పుతారో !!

'ఎప్పుడు చదివారూ మీరు యివన్నీ.....ఆరు నెలలనుంచీ చెప్పారు గారేం. యింట్లోనే చదువుకునేదాన్నిగా' అన్నది ఆనందంతో.

'ఎబ్బే నాకేం వచ్చు. పట్టి మూర్ఖణ్ణాయును. అంటూ చొక్కా తొడుక్కొని చక్కాబోయాడు' వక్కలాకులు మెక్కుతూ.

అనసూయ ఆశ్చర్యపడుతూ నిలబడ్డది కొంచెం సేపు. 'నివురుగప్పిన నిప్పు' అన్నది. వాకిట్లోకి జూచింది. మా 'సంసారగోష్ఠి యెవరైనా విన్నారేమోనని, నవ్వుతారేమోనని......వెంటనే లోపలికి బోయింది నవ్వుకుంటూ.

—:o:—

## 'గూగులు'

శ్రీమతి గంజి అన్నపూర్ణగారు

ఎక్కడి గువ్వవమ్మ! మదియేలనటుల్ కదుఁకుందికూయు, నీ
చక్కని యాకృతుల్ వినయచాయలు మాయునుగాదె తల్లి! చూ
డక్కడ నొప్పివచ్చు, మరి యంతయు కంపితమొందుమేను, గూ
డక్కడ నున్నదే! త్వరితమెక్కవె! గూగులు మానుమా చెలీ!
కొట్టెన? నీమనోహరుడు కోపగతిన్ నెటులైనపోయెనా?
నట్టడవిన్ నినున్ విడచి నాథుడు శూలవనిన్ తలంచకన్
ఎట్టిడివాడటమ్మ నినుయిట్టు లఘాతమునందు ద్రోసెనా?
కొట్టెడివారలన్ వినవె! కోమలి! పీడవె సత్వరంబునన్.

అబలలంచును గాదె వారంతరీతి
బాధలనుపెట్ట పలువిధాల్ బలిమికొలఁది
రమ్ముసోదరి త్వరిత వేగమ్ముతోడ
నరయుపోదము నాథుల నాథుగూడ.